# ఓడిపోయిన రాము

వాళ్లిద్దరూ స్నేహితు లనటాని కేమంత ఆస్కారంలేదు. విరోధులు మాత్రము కాదనే చెప్పాలి. కాని వాళ్ళు స్నేహితులనే లోకం అనుకుంది అయితే లోకం అనుకోని దేముంది? అది అనేక రకాలైన వాటిగురించి తనకు తోచినట్లు అనేకరకాలుగా సిద్ధాంతీకరించుకొని కూర్చుంటుంది. అయితే ఈ సిద్ధాంతాల ప్రభావం వాళ్ళమీద ప్రసరించకుండా ఉండలేదనీ చెప్పలేము. కాని నిజానికి వాళ్ళిద్దరూ స్నేహితుల మనే అనుకున్నారు. ఇంతకీ విచిత్ర మేమిటంటే వాళ్లు స్నేహితులమని అనుకుంటూనే విరోధుల్లా ప్రవర్తిస్తారు. నిజాని కీ ప్రపంచంలో ఎవరైనా గొప్ప విరోధులున్నారంటే వాళ్ళీ కుటుంబాలలోని భార్యాభర్తలనే చెప్పాలి. అయితే వాళ్ళంత స్నేహంగా ఉండేవాళ్ళు కూడా అరుదే! సరిగ్గా ఇదే స్థితి వీళ్ళలోనూ ప్రతిబింబిస్తున్నదా అంటే అదీ అనుమానమే!

మన అనుమానాల మాట ఎలా ఉన్నప్పటికీ ఇదీ-అదీ అని కచ్చితంగా చెప్పటానికి వీలులేని వాళ్ళ స్నేహాలను గురించి కాస్త పరిశీలిద్దాం.

వాళ్ళిద్దరికీ స్నేహం ఒకానొక ఆటల పోటీలో కలిగింది. అది వాళ్ళ చిన్నప్పుడు. అట్లా వాళ్ళు స్నేహితు లౌతూనే వాళ్ళొకరి నొకరు అనుమానించు కున్నారు. ద్వేషించు కున్నారు.

చెడుగుడులో ఇద్దరూ "కూత" బాగానే కూసేవారు. అట్లా ఆ కూత కూసేప్పుడు, "వాడు హెచ్చుసేపు కూయ గలుగుతున్నాడా నేను హెచ్చుసేపు కూయగలుగుతున్నానా?" అన్న భావం వాళ్ళల్లో ప్రజ్వలించి ఒకరిమీద ఒకరికి ఈర్ష్యను కలిగించేది. కూతలోనే కాకుండా ఆటలోకూడ వాళ్ళిద్దరిదే పై చేయి కావటంవల్ల, ప్రేక్షకలోకం లోంచివచ్చే ప్రశంసలు తమకే చెందాలని; ఇద్దరూ కాక్షించేవారు, ఆశించేవారు. కాని వారికవి చెరిసమానంగానే లభించేవి.

బాబ్జీ కూత కూస్తూ రావటం; తమాషగా అతని కాలి పీలమండ, కదలటానికి వీలులేకుండా, ఒడుపుగా రాము పట్టు కోవటం-మిగతా సైన్యం ముట్టేయడం-వీళ్ళందరినీ తోసుకొని మహాబలంతో బరిమీదకు బాబ్జీ వచ్చి పడటం, అప్పుడే పెదవి కరచుకోవటం- ప్రేక్షకలోకంలో చప్పట్లు మిన్నుముట్టడం ఒక్కసారిగా సాగిపోయాయి. వెంటనే బాబ్జీమీద పడ్డ ఆట గాళ్ళు తప్పుకున్నారు. అతని పెదవి వెంట కారిపోతూన్న రక్తాన్ని రాము తన చొక్కాతో అప్రయత్నంగా తుడిచాడు. రాము అట్లా తుడుస్తూవుంటే, బాబ్జీ కాదనలేదు. అతనిలో

విజయసూచకమైన గర్వచిహ్నం తొణికిసలాడింది. రాము బాబ్జీ ముఖం చూడకముందే "తుడిస్తే ఏమి పోతుంద"ను కుంటూ "అరే! ఇలా ఎందుకు చేశాను? నా చొక్కా అంతా రక్తం అయిపోయిందే." అని బాధపడ్డాడు. రాము తుడిచినందుకు బాబ్జీ కేమీ కృతజ్ఞత కలుగలేదు. పైపెచ్చు "రాము తన కాలు నెంత గట్టిగా పట్టుకున్నాడు!" అని అను కొన్నాడు. "నేనెంత గట్టిగా పట్టుకున్నా విజయం వాడిదే అయిపోయిందే" అని రాము విచారించాడు. అయితే ఇవి వాళ్ల మనస్సుల్లో కలిగిన పరివర్తనలే. పైకి ఒకసారి ఒకరి నొకరు చూసుకొని ఓ నవ్వు నవ్వుకున్నారు. తరువాత ఆ చెడుగుడు క్షేత్రంలో ఏమాత్రం ఓ క్షణం ఖాళీఅయినా వాళ్లెదురెదురుగా ఉన్న తమ ముఖాలలోకి చూసుకోవడం-అట్లా చూసుకున్నప్పుడల్లా ఇద్దరి ముఖాలలోనికి నవ్వు తరు ముకురావడం జరిగింది. ఈ నవ్వు రావడంలోని ఉద్దేశము వాళ్లకు బోధపడలేదు. కాని ఎందుకనో ఊరికే నవ్వు వస్తూంది. చివరి కానాటికా ఆట అయిపోయింది. ఆరోజునే వాళ్లు రోజూ కలపటానికి వీలైన పరిస్థితి ఏర్పడ్డది.

బాబ్జీ యింటికి, రాముా యింటికి చాలా దూరంఉంది. ఆ దూరం వాళ్ళ ఇళ్ళమధ్యనే కాకుండా వాళ్ళ ఇళ్ళకూ, వాళ్ళ పరిస్థితులకూ కూడా ఉంది. బాబ్జీ ఆరోజుల్లో ధనవం తుని బిడ్డ. అతని ఇంట్లో నౌకర్లున్నారు. వాళ్ళతనెప్పుడూ

"చిన్నదొరగా" రంటారు. స్కూల్లో మాస్టార్లుకూడ అతన్ని "ఏమోయ్" అంటారు.

ఇక రాము ఇల్లు చిన్న పెంకుటిల్లు. అద్దైనా అద్దెకొంప. అతనింట్లో వాళ్ళెవ్వరూ, చివరకు "చిట్టిబాబు" అద్దైనా పిలవరు. వాళ్ళన్నయ్య రోజూ "ఏరా" అంటూ "ఇది చేయలేదు అది చేయలేదు" అని మొట్టికాయలు వడ్డిస్తాడు. వాళ్ల మాస్టారుకూడ "ఏరా" అనే పిలుస్తాడు. అయితే రాము, ఇట్లా పిలవటాన్ని ఎప్పుడూ అపార్థంచేసుకోలేదు. అందులోని ఆప్యాయతనే చూడగలిగాడు. అట్లా మాస్టారు పిలిచేప్పుడు అతని మనస్సెంతో ఉప్పొంగేది. బాబ్జీకి మాత్రం "ఏమోయ్" అని ఆ ఉపాధ్యాయుడన్నప్పుడల్లా బాధగాఉండేది. ఆయన తన్నుపేక్షించబుతున్నాడా అన్న భావం అతనికి చూచాయగా తోచేది.

రాము నాన్న పేదవాడైనా, చాల గౌరవంతో బ్రదుకుతూన్న మనిషి, వాళ్లెప్పుడూ తిండికి పెద్దలోటు పొందలేదనే చెప్పాలి. 'అయితే వాళ్లకు గుడ్డలకు కావలసినంత లోటు ఉందని చెప్పక తప్పదు. బట్టలు ఆట్టే లేకపోవడంవల్ల రాము మాసిన గుడ్డలే కట్టుకుంటూఉండేవాడు. వీలుగా ఉంటే తనే చాకిరేవు పెట్టేవాడు. అతని చొక్కాలు సర్వసాధారణంగా భుజాలమీద కోపగించేవి. ఆ చిరుగు కనిపించకుండా అతను ఆ చొక్కా చేయిని ఆ చినుగు లోనికి త్రోసి భుజందాపుగా ఆ చిరుగున్న, లోకానికి కనుపించకుండా మూసేవాడు. అయితే

ఆ పశువాకం చేయి, అస్తమానం జారిపోయేది. ఇతను అస్త మానం దాన్ని పైకి ఎగద్రోసేవాడు. ఇట్లా చేయడంవల్ల అతని చేతిమురికి, అక్కడ దట్టంగా అంటుకొని, అక్కడ అసహ్యంగా తయారవ్వేది. ఇది చూస్తే బాబ్జీకి డోకువచ్చేది. ఇతనితో తిరగటం అతనికి నమస్కరించేది కాదు. కాని రాము, తను బడికి పోయే మార్గంలోనే ఉన్న బాబ్జీ ఇంట్లో అతనికోసం ఎప్పుడూ వాకబు చేయకుండా పోయేవాడు కాదు. బాబ్జీ రామకన్నా ఎప్పుడూ ముందు పోయేరకం కాదు. కాబట్టి అతనితో కలసి బడికి వెళ్లక తప్పేదికాదు.

"బాబ్జీ! బడికి పోదాంరా" అంటూ ఓనాడు రాము లోనికి పోయి ఓ సోఫాలో చతికిలబడ్డాడు. బాబ్జీ ఇంకా తయారవు తూనే ఉన్నాడు. అతను వచ్చేవరకూ రాము ఆ సోఫాలోనే కూర్చున్నాడు. "అబ్బ! ఈ సోఫాలో కూర్చుంటే ఎంత హాయిగా ఉంది" అనుకొన్నాడు. అయితే "చాలా హాయిగా" ఉందని మాత్రమే రాము అనుకొన్నాడు గాని— వీళ్లు ధన వంతులు-మేము బీదవాళ్లము-మాకివి లేవు వీళ్లకివిఉన్నాయి ఇల్లా ఎందుకు జరిగింది?" అని మాత్రం ఆపసికూన ఆలో చించలేదు సరిగదా అందుకు విచారించనూ లేదు. "గాడిద గుడ్డు ఇవన్నీ మా పెద్దనాన్న గారింట్లో లేవా!" అని అను కొన్నాడు. రాము పేదవాడైనా అతని మనస్సులో మాత్రం పేదతనం లేదు. అంచేతనే ఏమాత్రం జంకూగొంకూ లేకుండా ఆ సోఫాలో కూర్చున్నాడు. "ఏయ్ రామూ... పోదాం

రావోయ్'' అంటూ బాబ్జీ తన గదిలోంచి వస్తూ రాము సోఫాలో కూర్చోవడం చూశాడు. అది అతనికి నచ్చలేదు. "రాము వట్టి దరిద్రుడు. అంతేకాదు. ఎలాంటి మురికి బట్టలు కట్టుకున్నాడో! వీడు కూర్చుంటే సోఫా పాడై పోతుంది కూడాను'' అనుకొన్నాడు. కాని పైకి "మా నాన్నగారు చూస్తే కోప్పడతారు. నువ్వెప్పుడూ ఆ సోఫాలో కూర్చోకు రామూ'' అన్నాడు. రాము ముఖం వివర్ణమై పోయింది. ఆతనికి మాటలు రాలేదు. వాళ్ళిద్దరూ అలాగే మూగ వాళ్లలా బడికి వెళ్ళారు. మరునాటినుంచి రాము, బాబ్జీని కలవటం మానివేశాడు.

రాము రాకపోవటం బాబ్జీకి ఇష్టంగానే ఉంది. కాని అతనికి, తోడు లేకుండా నడచి బడికిపోవటం ఏమీ బాగుండ లేదు. ఏమి తోచడం లేదు కూడాను. అంచేతనే కాబోలు ఓ రోజున అకస్మాత్తుగా "ఏరా రామూ! మా యింటికి రావడం మానేశావు''అన్నాడు. బాబ్జీ, ఇది వినగానే రాము, "అరేవాళ్ళింటికి ఎందుకు వెళ్లడం మానేశాను!'' అను కొన్నాడు. ఆలోచించి చూస్తే ఇందులో బాబ్జీతప్పు ఏమీ ఉన్నట్లు కనుపించడమే లేదు. మళ్ళీ అతనెంతో ప్రేమతో పిలుస్తున్నాడు కూడాను. ఇలా అనుకొంటూనే "అబ్బే ఏమీ లేదురా'' అన్నాడు. రాము ఎప్పుడైతే తనను "రా'' అని సంబోధించాడో అప్పుడే బాబ్జీ మళ్ళీ కలవర పడ్డాడు. "వీడు నన్ను రా అనటం ఏమిటీ?'' అనుకొన్నాడు. వీడితో ఎందుకు

మాట్లాడేనా అనిపించిం దతనికి, తీరా పిలిచిన తరువాత వద్దన లేక పోయాడు. ఈ విధంగా వాళ్లకు మాటలు కలవటం— రాము తిరిగి బాబ్జీ ఇంటికి హాజరు కావటం— బాబ్జీ రాము పిలిచే 'రా'' కు క్రమేణా అలవాటు పడటం జరిగింది.

ఇప్పుడు రాము వాళ్లింట్లోకి మునుపటి కన్నా నిర్భయంగా పోతాడు. ఏమంటే ఎవరైతే ''సోఫాలో కూర్చుంటే కోప గిస్తా'' రని బాబ్జీ అన్నాడో ఆ బాబ్జీ నాన్న, రామునెంతో ప్రేమతో చూస్తూ ''మీనాన్న చాలా గొప్పవాడు. పాపం చిదికిపోయాడు'' అని చెప్తూ రోజూ రాముతో కులాసాగా ఏదో కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. బాబ్జీ కిది నచ్చలేదు. ''అరే! చిట్టిగాణ్ణి తీసుకొచ్చినప్పుడు— వాడు ''సోఫాలో కూర్చున్నప్పుడు మా నాన్న అసహ్యించుకున్నాడేం?'' అనుకున్నాడు. ఇలా వాళ్ల నాన్న రాముతో మాట్లాడటం అతనికి చాల విచిత్రంగా తోచింది.

ఇప్పుడు రాము తనకు చొక్కాలు కావలిస్తే బాబ్జీ బీరువాలోనివి స్వయంగా తీసుకొని తొడిగేసుకుంటాడు. ఇట్లా తొడుకున్నప్పుడల్లా ''చాకలి బట్టలు తేలేదు. ఉతికి మళ్లీ ఇచ్చేసెయ్యకేమిటి!'' అనుకొంటాడు; ఇట్లా చేస్తూన్న రామును చూస్తే బాబ్జీ ''వీడి బాబుగారి సొమ్ము దాచిపెట్టి నట్లు ఎట్లాతొడుక్కుంటున్నాడో'' అని అనుకొంటాడు. కాని పైకి ఇద్దరూ ఆ బట్టలు తొడుక్కునే సమయంలో, నవ్వుతూ వుంటారు; పాపం. ఒకరి భావం ఒకరు అర్థం చేసుకోకుండానే!

ఇక సినిమాలకు వెళ్ళడానికి రాముదగ్గర డబ్బులుండవు. ఈ సంగతి ముందుగా బాబ్జీతో కదపటానికి అతను వెను కాడడు. కాని బాబ్జీ మాత్రం రాము తనకన్న ముందుగా "సినిమాకు వెళ్దాం రారా" అని అంటే ఎంతో బాధపడ తాడు. ఆ సంగతి తనే ముందుగా చెప్పాలి. రామును తను రమ్మని పిలవాలి. వాడు టిక్కెట్లు తేవటానికి తను డబ్బు లిచ్చేదాకా ఆగాలి. ఇట్లా చేస్తే తన కానందం. కాని ఇది ఇట్లాజరక్క ముందుగానే రాము "చూడరా డబ్బులేమేనా ఉంటే సినిమాకుపోదాం" అంటాడు. అప్పుడు బాబ్జీ "ఏం సినిమాలు పోనిస్తూ" అంటాడు కాని రాము "చాలా మంచి సినిమారా; పోదాం పద" అని బలవంతం చేస్తాడు. ఈసారి బాబ్జీ కాదనలేడు. అలా అంటే తను డబ్బులకు వెనకాడు తున్నట్లు అనుకొంటాడేమోనని అతని భయం. ఇది చూసి "తన మాట ఇంతకన్నా వినే స్నేహితు డెవరుంటాడ"ని అనుకొంటాడు రాము.

రోజులు నడుస్తూన్న కొద్దీ బాబ్జీ రాములకు వయసు తరుముకొస్తూంది. వయసుతోబాటు వాళ్ళ చేతల్లో గూడా కొత్త మార్పు లారంభిస్తున్నాయి. ఇప్పుడు రాము, బాబ్జీని సినిమాకు వెళ్దాం రమ్మని అడగడు. బాబ్జీ రామును, "రావోయ్ సినిమాకు పోదాం" అని తొందరచేస్తాడు. రాము "ఎందుకు డబ్బు దండగ" అంటాడు. బాబ్జీ ఈ మాటలకు బాధపడతాడు. "ఏమిటోయ్ డబ్బు దండుగ,

రమ్మంటూంటే'' అంటాడు తాపీగా. అయితే ఈ మాట లోని అధికారాన్ని రాము గుర్తించక పోడు. కాని దానికి అడ్డు చెప్పడు. తను బాబ్జీ! శారీరకంగా మానసికంగా బానిసనై పోతున్నానా అనుకొంటాడు. ఇప్పుడు బాబ్జీ రాము వైపు చూసి జాలిపడతాడు. కాని ఇదంతా ఓ క్షణం. మళ్లీ ఆ జాలి నాశనమైపోతుంది. ''ఏమిటి వీడికీ వెధవ బెట్టుసరి!'' అనుకొంటాడు. రాము కూడ ''క్షవరమయ్యేది వాడికిగాని నాకు కాదుగా. డబ్బు యెట్లావచ్చిందో తెలియని వాళ్లు ఇట్లా కళ్ళుమూసుకుని ఖర్చు పెడుతూవుంటే నే నెందుకు మధ్యన అడ్డురావడం!'' అనుకొంటాడు.

ఇప్పుడు రాము కట్టవలసిన కాలేజీ జీతం కూడ బాబ్జియే చెల్లిస్తున్నాడు. ఇట్లా చెల్లిస్తూన్నప్పుడల్లా ఓ బీదవాణ్ణి చదివిస్తున్నాను గదా అని తృప్తిపడతాడు. రాము తన చదువైన తరువాత ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించి బాబ్జీ ఇచ్చిన డబ్బంతా ఇచ్చివేయాలని ఆలోచిస్తూ వుంటాడు. ఇప్పుడు బాబ్జీ ఏ అధికారాన్ని చలాయించినా రాము అతని ఎదుట యేమీ అనలేని పరిస్థితిలోనికి దిగజారిపోయాడు. అయితే ఆ అధికారాన్ని నిజంగా చలాయిస్తున్నట్టుగా బాబ్జీకి తెలుసా అంటే ఏమో అనాలి.

ఇద్దరూ బట్టల కొట్టులోనికి వెళ్తూ వుంటారు. బాబ్జీ తనకు కావలసినన్ని బట్టలు తీసుకుంటాడు. రామును కూడా తీసుకోమంటాడు. రాము తన కక్కర్లేదంటాడు. ''అరె

తీసుకోమంటూంటే" అంటాడు బాబ్జీ విసుగుతో. రాముకు మరి గత్యంతరము లేదు. ఇది రాముకు నిజంగా ఉపకారమే. కాని ఈ ఉపకారాన్ని రాము ఇట్లా గ్రహించలేడు. అయితే బాబ్జీకి ఇంతకన్నా మరొకవిధంగా చెప్పటంకూడా చేతగాదనే చెప్పాలి. సినిమాదగ్గర రామును టిక్కెట్లు తీసుకరమ్మని అంటాడు. రాము బాధపడతాడు. అయితే రాము ఈ విషయమై బాధపడతాడని బాబ్జీ ఊహించలేడు. బాబ్జీ ఇట్లా ఎందుకు చేస్తున్నాడా అని రాము అప్పుడప్పుడు ఆలోచిస్తూ ఉంటాడు. ఇట్లా ఆలోచించినప్పుడల్లా బాబ్జీకి తనపై వాత్సల్యం లేదని అనుకొంటాడు. "అయితే తనగురించి ఖర్చుపెడుతూన్నదంతా దేనికి?" అన్న ప్రశ్న అతనికి తోస్తుంది. దానికి జవాబుగా "అతని తత్వమే అంత" అన్న ఊహ ఆ సందేహాన్ని తీర్చేస్తుంది. కాని రాము ఇంకా ఆలోచిస్తూనే ఉంటాడు. "తనమీద ప్రేమ లేకపోతే తాను అడగకుండానే బాబ్జీ ఎందుకీ సహాయం చేస్తాడు" అనుకొంటాడు. "నిజంగా బాబ్జీకి తనపై ఎంతో ప్రేమ ఉంది" అనుకొంటాడు. కాని వెనువెంటనే అతని మనసులో మరొక ఊహ మెరుస్తుంది. బాబ్జీగుణం చిన్నప్పటి నుంచీ ఏమీ మంచిదికాదని అందుకు సంబంధించిన విషయాలన్నీ అతనికి జ్ఞాపకానికి వస్తాయి. ఆ వేళ తను రక్తం తుడిచినప్పుడు కూడా బాబ్జీకి సద్భావమున్నట్లు ఊహించలేననుకొంటాడు. అంచేతనే అతను తనతండ్రి కోపగిస్తాడనే శంకతో తన ద్వారి

ద్రవ్యస్వరూపాన్ని ఆసోఫాలోంచి లేచి పొమ్మన్నాడని బాధ పడతాడు. కాని ఏమి చేయగలడు పాపం! "ఏదో ఇది ఇట్లా జరుగుతూంది ఇప్పుడు మన అవసరం" అనుకొంటాడు. బాబ్జీ పురమాయించే పనులను నిర్వర్తిస్తూ ఉంటాడు. ఇట్లా చేస్తున్నప్పుడల్లా బాబ్జి రామును చూసి, "రాము ఎంత! మంచివాడు!" అనుకొంటాడు. అలా అనుకుంటూనే "అబ్బో! అతనికెంత గర్వమో! మన మింత అడగకుండానే అన్నీ చేస్తున్నామా; అయినా కాస్తకూడ కృతజ్ఞత ఉన్నట్టు కనుపించదు!" అనుకొంటాడు.

ఇట్లాంటి పరస్పర విరుద్ధ భావాలు కల వీరిద్దరూ స్నేహితులు. పాపం! వీరు త్వరలోనే దూరమై పోవలసిన అగత్యం ఏర్పడింది.

బాబ్జితో ఓనాడు రాము "నేనిక ఈ ఊళ్ళో ఉండను బాబ్జీ" అన్నాడు. "ఏం? ఇక్కడ నీకు కష్టంగా ఉందా" అన్నాడు వెంటనే బాబ్జి. ఇట్లా అన్నందుకు ఎందుకో బాధ పడ్డాడు. ఇది అంది పుచ్చుకుని రాము 'లేదు. నిజంగా నీ సహాయం మరచిపోలేను బాబ్జీ, కాని మద్రాసులో మా మామయ్య అక్కడ తన వర్తక విషయాలను చూడటానికి వచ్చేయమంటున్నాడు. వెళ్ళదామనిఉంది." అన్నాడు. ఇందుకు బాబ్జీ ఏమీ మాట్లాడలేదు. కాని కాస్సేపాగి, "నిజంగా వెళ్ళిపోతావా రామూ!" అన్నాడు హృదయాలు

ద్రవించేట్టు. రాము కడుపులో చేయిపెట్టి దేవినట్టయింది. అతనికి కళ్ళలో నీళ్ళు నిండుకొన్నాయి. ఇంతలో బాబ్జి "సరే వెళ్ళు" అన్నాడు సామాన్యంగా. అలా అని వెంటనే నవ్వుతూ "అయితే రేపటినుంచి మాకు ఖర్చు తగ్గుతుందన్న మాటే!" అన్నాడు. ఈ మాటతో రాము మొహం పాలిపోయింది. ఆ మాటలో ప్రేమఉన్నదో లేక దాని వెనకాల రాక్షసత్వమే దాగివున్నదో అర్థంకాని రాము మొగం ఓ వెలలేని నవ్వు ప్రదర్శించి ఊరుకుంది.

రాము వెళ్ళిపోయాడు. అప్పటినుంచీ బాబ్జికి ఏమీ తోచేదికాదు. కొన్నాళ్ళవరకూ కాలం అదోలా దొర్లి పోయింది. తరువాత కొంతమంది క్రొత్త స్నేహితులు కలశారు. డబ్బు చాలా మట్టుకు—వాళ్ళమూలాన కాక పోయిన నప్పటికీ తింటూ కూర్చుంటే కొండలైనా తరిగి పోతాయి కాబట్టి—అతని ధనం క్రమేణా హరించిపోవడం మొదలు పెట్టింది. కొన్ని భూములుకూడా అమ్మివేయవలసి వచ్చింది. కొడుకును విశ్వవిద్యాలయంలో చదివించటానికి, అతనికి నెలనెలా డబ్బు పంపటానికి చాల బాధపడేవాడు. ఇహ కుమార్తెకు పెళ్ళిచేయవలసిన సమయం కూడ దగ్గర పడింది. ఆమె పెళ్ళి మునుపటి హుందాతో ఇప్పుడు చేయటానికి కెక్కడా ఆస్కారంలేదు. కాని అందుకాతని తాపత్రయం చెప్పతరం కాదు. నిజానికి యీ గొప్పతనంతో వచ్చిన చిక్కే! ఇది ఉండకనే ఉండకపోవాలిగాని వుంటే

దాన్ని వదలించుకోవటం బహు కష్టం! అది వదలిపోయినా అది వుండాలని మాత్రం జీడిగింజలా పట్టుకు వ్రేలాడుతారీ మానవులు. బీదవాళ్లను బట్టి చూసినా, మధ్యతరగతి ప్రజల్ని బట్టి చూసినా, బాబ్జీ ఏమంత బీదవాడు కాదు. కాని ఇప్పుడాతను పుట్టెడు దరిద్రం అనుభవిస్తూన్న వాడిలా విలపిస్తున్నాడు.

ఈ దెబ్బతో అతనికి రామునుగురించి కర్ణాకర్ణిగా వింటూన్న సంగతుల మీదకే బుద్ధి పోతూంది. ఇప్పుడు రాము చెన్నపట్నంలో 'అద్భుతంగా వ్యాపారం సాగిస్తున్నా డని అందులో లక్షలార్జించాడని విన్నాడు. ఐతే మొదట్లో రాము వ్రాసిన జాబులకు బాబ్జీ కొన్నింటికి జాబు వ్రాసినా, తరువాత సహజంగా వున్న బద్ధకంవల్ల జాబు వ్రాయడం మానివేశాడు. ఆ తరువాత రాము జాబులు వ్రాయక పోవటం బాబ్జీకి చాలా బాధ కలిగించింది. తను వుత్తరాలు రాయకపోయినా, రాము మాత్రం వ్రాస్తూవుండాలని వాంఛించేవాడు. అందువల్ల రాముకు ఈపాట్మాత్రమైనా కృతజ్ఞతలేదని మనసులో భావించేవాడు. మద్రాసు నుంచి ఎవరైనా వచ్చి రాముసంగతి ఏమాత్రం చెప్పబోయినా కసరి మీదపడేవాడు, అతనిమాట తనవద్ద వినబడ నిచ్చేవాడు కాదు. కాని నిత్యం ఆ రామునుగురించే ఆలోచించేవాడు. అప్పుడప్పుడు రాముదగ్గర కనీసం అప్పుగానైనా కొంత డబ్బు పుచ్చుకోవాలనే ఊహ తట్టేది. కాని వెనువెంటనే "ఛీ. ఛీ.

వాడిదగ్గరా? అని మనస్సును కసరేవాడు. అంతటితో అది నోరు మూసుకొనేది.

ఇక రాము వర్తకంలో పడి సమస్తమూ మరచిపోయాడు. ప్రస్తుతం అతనికదే ప్రాణంలా వుంది. లేచిన దగ్గర నుంచి నిద్రపోయేవరకూ అతని కొకటే వ్యాపారం అభివృద్ధిని గురించిన ఆలోచన. ఇదే ఆలోచనతో అతనెప్పుడూ సంచరిస్తూ ఉంటాడు. ఓ రోజున రాము కారులో బీచిమీందుగా పోతూ ఓ చిరకాల పరిచితుణ్ణి తన వూరివాణ్ణి చూశాడు. ఆతనతో రాము కెందుకనో మాట్లాడాలని బుద్ధి పుట్టింది. రాము కతని ఊరివారు ఇంతకూ పూర్వం ఆ మహానగరంలో చాలసార్లు కనుపించారు. ఐతే అతను ఎప్పుడూ వాళ్ళతో మనసువిప్పి మాట్లాడలేదు. ముక్తసరిగా మూడే మూడు మాటలు కుశలప్రశ్నలు లాంటివి మాట్లాడి అక్కడ నుంచి వెళ్లిపోయేవాడు. వాళ్లతో ఆట్టే మాట్లాడితే ఎక్కడ పనులు పురమాయిస్తారో అని రాము బెదిరేవాడు. ''పట్నంలో ఉన్నావు. పలుకుబడిగలవాడివి. ఈ మాత్రం పనిచేసిపెట్టలేవా'' అంటారు వాళ్లు. అప్పుడు ఇరుకున పడవలసి వస్తుంది. ఇటువంటివంటే రాముకు తలనొప్పి! అందువాత ఇలాంటి వాటిల్లో రాము జోక్యం కల్పించుకొనేవాడు కాదు. ఆట్టేసేపు వాళ్లతో మాట్లాడేవాడు కాదు.

ఆవేళ రాము కారులో ఎవరూ లేరు. చుట్టూ చూసినా పరిచయమున్న మొగమేదీ కనిపించలేదు. అప్పుడే ఇంటికి

పోవటాని కతనికంత మనస్కరించలేదు. ఆ సమయంలోనే ఆ పరిచితుడు కనిపించడం అతనితో కాస్సేపు బాతాకానీ వేదాం అనే ఉద్దేశ్యం కలగటం జరిగింది. పాపం ఆ పరిచితుడు రామును ముందుగా పోల్చుకోలేదు. కాస్సేపు నిదానంగా చూసి అబ్బ! నువ్వా! బాబ్జీతో ఉండేవాడివి. ఆ రామువే గదూ! ఎంతగా మారిపోయావు'' అన్నాడతను. రాము మొఖం వెంటనే కళావిహీనమైపోయింది. అతని వ్యక్తిత్వము ఘాటుగా దెబ్బతిన్నట్లయింది. కాని వెంటనే తమాయించుకొని "అయితే బాబ్జీ ఇప్పుడెలా ఉన్నాడు?'' అన్నాడెలాగో వెంటనే అతను "పాపం బాబ్జీ ఇప్పుడు పూర్తిగా చిదిగిపోయాడు అతనికి రోజులు గడవడమే కష్టముగా ఉంది'' అన్నాడు. వెంటనే రాము "ఆ...!'' అని మాత్రం ఎలాగో అనగలిగాడు. "అవును రామూ! ఇప్పుడాతను తన కొడుకునే చదివించుకోలేని స్థితిలో ఉన్నాడు.'' ఈ ముక్క వినగానే రాము గుండెలు రెపరెపలాడిపోయాయి. వెంటనే అతనిని కారులో కూర్చుండమని ఇంటికి తీసుకవెళ్ళాడు. బాబ్జీని గురించి చాలా సంగతులు అడిగాడు. అతను "బాబ్జీకి ఆడుఖ్ళో ఇక అప్పుకూడ పుట్టడం కష్టం'' అని చెప్పేసరికి రాము ఇక వినలేకపోయాడు. అతని హృదయం ఒక్కసారిగా వెళ్ళి బాబ్జీవద్ద వ్రాలాలని ఆశించింది. అయితే రాముకూ బాబ్జీకి మధ్య మూడుమండల యాభైయారు మైళ్ల ఎడము, అంతులేని అఖాతము ఏర్పడివుంది. ఇది దాటుకొని పోవాలి గదా! జాగ్రత్తగా చేరగలిగితేనేగదా కలయిక!

రాము మరునాడే బాబ్జీవద్దకు బయలుదేరాడు. ఏదో క్షమించరాని తప్పు చేసినట్లు రాము తలపోశాడు. ఫస్టు క్లాసులో కూర్చొని ప్రయాణం చేస్తున్నా అతనికేమీ సుఖమనిపించడంలేదు. రైలు ఇక్కడ మాయమై అక్కడ అవతరించగూడదా అని అతని హృదయం ఆరాటపడింది. "అబ్బ! బాబ్జీ ఎంత మంచివాడు! బాబ్జీ అంత మంచివాళ్లింకెవ్వరున్నారు." అదేముక్క— వేయి కంఠాలతో అతనిలో ప్రతిధ్వనించడము మొదలుపెట్టింది. ఇప్పుడా భవనం-బాబ్జీ నివసించేది-ఎట్లా అందవిహీనమై ఉందో, రాము ఊహించుకోలేక పోయాడు. "పూటకో జత విప్పుతూ ఎప్పుడూ మల్లెపువ్వులా ఉండే బాబ్జీ, ఇప్పుడెన్ని ఇక్కట్లు పడుతున్నాడో! పాపం ఇప్పుడు కొడుకునే చదివించుకోలేక పోతున్నాడు. ఎలాంటి బాబ్జీకి ఎలాంటి దుర్గతి! ఛీ ఛీ, నావంటి మిత్రద్రోహి ఇంకొకడెవ్వడూ ఉండడు. ఇన్నాళ్ళు బాబ్జీని చూడకుండా ఉండగలగటం నాకే తగు!" రాముకు కొద్దిగా నిద్రపట్టింది ఆ కొద్దిపాటి నిద్రా మత్తుగా మారింది.

మెయిలు జాగ్రత్తగా చేరవలసినచోటుకు చేరింది. ఇక రాము చేరవలసిన చోటుకు చేరాలి. పూర్తిగా మస్తాబైన రాముతో ఒక్కసారిగా "ఇదేమిటీ నీవు బాబ్జీ ఇంటికి వెళ్ళడమేమిటి?" అంది అతని మనస్సు. "నిజంగా నీకు మతిలేదు రామూ! లక్షల కధికారివైన నీవు నీతో పోలిస్తే ఎందుకూ కొరగాని ఆ బాబ్జీ ఇంటికి వెళ్ళడమా? ఇదేమిటి రామూ—

నువ్వు ఇలాంటి పని చేస్తున్నావు?'' రాము రెండడుగులు ముందుకువేసి ఆ ప్లాటుఫారంమీద అప్రయత్నంగా నిలబడి పోయాడు. దీని భావమేమిటో అర్థంకాని పోర్టరు ఓ అడుగు వెనక్కు వేశాడు. ''నీవంటే కొంచెమైనా ఇష్టంలేని ఆ బాబ్జీ దగ్గర కెట్లా వెళ్తున్నావు రామూ? బలే రామువే! అప్పుడు నీ చేత అడ్డమైన చాకిరీ చేయించుకున్నాడా బాబ్జీ; మరి ఇప్పుడు నిన్ను పిలవకుండానే తన యింటికి రప్పించుకుంటున్నాడు. నిజంగా బాబ్జీ ఎంతకైనా గట్టివాడు. ఇంకకీ నీ ఎంత దుర్భ లుడ వెట్లా అయ్యావయ్యా! అయ్యయ్యో!'' రాముకు బాబ్జీఇంటికి వెళ్లడానికి కాళ్లాడలేదు. అయితే సైకిలురిక్షా వాడు 'బాబూ ఎక్కడకు' అన్నాడు. రాము చెప్పకుండా ఉండలేకపోయాడు.

''రిక్షా వాళ్లందరికీ తెలుసు కాబోలు! సరిగ్గా బాబ్జీ యింటిముందు ఆపాడు. అబ్బ! ఈభవన మెంత సుందరంగా ఉంది! అరె! బాబ్జీ పేదరికం అనుభవించడం లేదా? దీని నింత అందంగా యెట్లా ఉంచగలిగాడు? లేక యింకెవరైనా ఉంటున్నారా? లోపల పరిచారికుల అలజడీలేదు. పూర్వం తను కూర్చున్న సోఫాలే అవి! అక్కడే ఉన్నాయి. ఎంత పరిశుభ్రంగా ఉన్నాయి! తన దగ్గర యింత డబ్బు ఉన్నా తన యిల్లు యిట్లా ఉండదు!''

చీమ చిటుక్కుమన్నా వినబడేంత నిశ్శబ్దంగా ఉంది. రాము ఆసోఫాలో కూర్చున్నాడు. కూర్చుండగానే ''మా

నాన్న కోప్పడతాడు. అందులో కూర్చోకు రాముా'' అన్నట్లు వినిపించింది. రాము వెంటనే లేచి పోయాడు. లోపల బాబ్జీ వున్నాడో లేదో, పిలవనా మాననా అని అనుమానించాడు. బాబ్జీ వచ్చేవరకు అతని మనస్సు నిలబడుట లేదు. అది జివ్వున లాగుతూంది. కాళ్లకు నుదురుకూ చెమట పెచ్చుతూంది. ఇంతలో బాబ్జీ బయలుదేరినట్లు లోపల బూటు అలికిడైనది. రాము నిలుచున్నవాడు నిలుచున్నట్లుండక కాళ్లు కదిపి రెండడుగులు వేశాడు. ''ఛీ, నేనెందు కిట్లా తడబడటం?'' అనుకున్నాడు. అప్పుడే ఆతడ బాటు సర్దుకోనక ముందే బాబ్జీ ఎట్టఎదుట నిలచిఉన్నాడు. రాముకు యేమి మాట్లాడాలో తోచలేదు. ''ఓ రామూ...!'' జరుగనిదేదో జరిగినట్లుగా అనేశాడు బాబ్జీ. '' మరే '' నన్నట్టుగా రాము ముఖము స్ఫురింపజేసింది. కాని రాము నోటివెంట మాట పెగిలి రాలేదు. కాని బాబ్జీ ''మళ్లీ మాకు ఖర్చు పెచ్చించడానికి వచ్చేవేమిటి? అన్నాడు. రాముా మొహం పూర్తిగా వివర్ణమైపోయినది. బాబ్జీ ముఖంలో ఏదో నవ్వు అవ్యక్తంగా గోచరించినది. రాము హృదయం క్షణంలో భగ్గున మండినది. అతని ధనం ''అవమానం! అవమానం! ఇది భరించ నలవికాని అవమానం!'' అని లక్ష కంఠాలతో ఎలుగెత్తినది. బాబ్జీ నవ్వినట్లుగానే ఓ నవ్వు నవ్వి, రాము 'కాదు ఈసారి మిమ్మల్ని పోషించడానికే వచ్చాను' అన్నాడు. అన్నవాడన్నట్టుగా ఉండక, వెంటనే నాలుక కొరుక్కున్నాడు. మళ్లీ

ఇట్లా నాలుక యెందుకు కోరుక్కున్నానా అని బాధపడ్డాడు. వెంటనే బాబ్జీ గుండెల్లో ఏ బాకు దింపినట్లయిందో కాని, అతను 'ఛీ ఎవడవురా నువ్వు? మమ్మల్ని పోషించడానికొచ్చావనంటావు! గుమ్మం దిగు ముందు!' అన్నాడు. రాము హృదయంలోని ఆశలు ఏమీ మాట్లాడ సాహసించలేకపోయాయి. బాబ్జీకి ఎదురుగా ఏమీ జవాబు చెప్పలేకపోయాయి. పాపం రాము పేదవాడుగా, ధనవంతుడుగా కూడా బాబ్జీముందు ఓడిపోయానే అని క్రుంగిపోయాడు.

రాముకు ఇప్పటికీ తీరని సమస్యే— బాబ్జీని ఎందుకు ఎదుర్కోలేకపోయానా అని-పాపం!